RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 245 పేజీలు - 08 శుక్రవారం 31 జులై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



## భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**- జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులకు సి.ఎస్. ఆదేశం**

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 30:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏవిధమైన ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉన్నందున చేపట్టాల్సిన మిగతా2లో...

## కూరగాయల సాగును ప్రోత్సహించండి

- సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి
- ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి
- నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 30:** రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మిగతా2లో...



## అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

- అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ
- జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
- అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 30:** అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మిగతా2లో...

## వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం



**- లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 30:** వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్‌సభ కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చనుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేడు మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్–1971 చట్టంలో మార్పుల కోసం మిగతా2లో...

## హిందుత్వ అంటే మన జీవనవిధానం

**మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య**



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 30:**హిందుత్వం అంటే మతం కాదని.. జీవన విధానమని భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. దేశభక్తి సమాజ ఐక్యత లోపిస్తే దేశం వెనకపడుతుందని పేర్కొన్నారు. గురువారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 'కర్మవీరులారా కదిలి రండి' గీతం ఆవిష్కరణ, విద్యార్థులతో మాటామంతిలో పాల్గొని మిగతా2లో...

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

- దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 30:** పేదలకు ఇంటిచింత లేకుండా చేయాలనే ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విడతల వారీగా పేదలందరికి ఇంటికలను సాకారం చేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని చంద్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపాయల




నిధులతో నూతనంగా నిర్మించిన మిగతా2లో...

## మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

- ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది
- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక



2లో


## నేను విద్యాశాఖకు ఎందుకు రాజీనామా చేయాలి?: సీఎం రేవంత్ రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 30:**2034 వరకు తెలంగాణ సీఎంగా తానే ఉంటానని రేవంత్‌రెడ్డి అన్నారు. ఫిన్లాండ్, జర్మనీ టీచర్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులతో ఆయన సమావేశమై మాట్లాడారు. "నేను విద్యాశాఖకు ఎందుకు రాజీనామా చేయాలి? పిల్లలకు అల్పాహారం అందించినందుకు రాజీనామా చేయాలా? ఐటీఐలను కాకుండా ఏటీసీలను ఏర్పాటు చేసినందుకా? మండలాల్లో విద్యాభివృద్ధికి ఏం కావాలో ఉపాధ్యాయులు సలహాలు ఇవ్వండి. టీచర్ల సలహాలను అధికారులు అమలు చేస్తారు. విద్యారంగంపై ఖర్చు పెట్టడానికి నాకు ఇబ్బంది లేదు." అని అన్నారు.

## వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన**



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 30:** తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. మిగతా2లో...

## వర్షాలతో రైతులకు ఊరట

- ఆరుతడి పంటల ప్రోత్సాహానికి చర్యలు
- రైతుల జీవనోపాధికి సంబంధించి పలు సూచనలు
- సిఎంకు సమర్పించిన నివేదికపై చిన్నారెడ్డి వివరణ




**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 30:**గత మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ఈ వర్షాలతో లభించిన తేమను, అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వం అమలు చేయదగిన ఆచరణాత్మక సూచనలను కమిటీ ప్రభుత్వానికి అందజేస్తుందని చెప్పారు. అనంతరం వివిధ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు సంయుక్తంగా రూపొందించిన నివేదికలోని ముఖ్యాంశాలను కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నివేదికలో తక్షణ, మధ్యకాల, దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికలతో పాటు రైతుల జీవనోపాధి పరిరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, పశుగ్రాస భద్రత, గ్రామీణ ఉపాధి కల్పన వంటి అంశాలపై సమగ్ర సిఫార్సులు చేశారు. రాష్ట్రంలో సాధారణ నైరుతి రుతుపవనాల వర్షపాతం 740.60 మిల్లీమీటర్లు మిగతా2లో...

# అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశించారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

# కూరగాయల సాగును ప్రోత్సహించండి

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది. గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది.

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్పిం÷-రక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి? పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షిం చేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, సాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలను పరిరక్షించేందుకు రూపొందించిన రాష్ట్ర స్థాయి సమగ్ర కార్యాచరణ నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి గురువారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి బోధి సెంటర్ లో అందజేశారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు కృపాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం మీడియా సెంటర్ లో నిపుణుల కమిటీ ఛైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రైతులకు నష్టం తగ్గించేలా నీటి వినియోగంలో పొదుపు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నాణ్యమైన విత్తనాల అందుబాటు, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు వంటి అంశాలకు నివేదికలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# వర్షాలతో రైతులకు ఊరట


(మొదటి పేజీ తరువాయి)

కాగా, జూలై 27 నాటికి 234.80 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై, సాధారణంతో పోలిస్తే సుమారు 30 శాతం లోటు నమోదైనట్లు కమిటీ పేర్కొంది. రాష్ట్రంలోని అత్యధిక జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో పాటు భూగర్భ జలమట్టం కూడా గణనీయంగా పడిపోయినట్లు నివేదికలో వివరించింది. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో సాగు విస్తీర్ణం తగ్గినందున, నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటలకు బదులుగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, నూనెగింజలు, కూరగాయలు, పశుగ్రాస పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను గ్రామాల వారీ కార్యాచరణ ప్రణాళికతో విస్తృతంగా ప్రోత్సహించాలని కమిటీ సూచించింది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను 75 శాతం వరకు సబ్సిడీపై రైతులకు అందించాలని సిఫార్సు చేసింది. వరి సాగును నీటి లభ్యత ఆధారంగా పరిమితం చేయడంతో పాటు డ్రిప్, స్పిం÷-రక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో, రిడ్జ్ అండ్ ఫరో, మల్చింగ్, వర్షపు నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్లు, భూగర్భ జలాల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని నివేదిక సూచించింది. ఉద్యాన పంటల సాగును విస్తరించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని కమిటీ అభిప్రాయపడింది. తక్కువ వ్యవధి కూరగాయల సాగు, ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, పట్టుపరిశ్రమ ఆధారిత సాగును ప్రోత్సహించాలని, డ్రిప్ ఇరిగేషన్, శాశ్వత పందిళ్లు, షేడ్‌నెట్ హౌస్‌లు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు సబ్సిడీలు అందించాలని సూచించింది. పశుసంవర్ధక రంగంలో పశుగ్రాస కొరత తలెత్తకుండా జిల్లా వారీగా పశుగ్రాస బ్యాంకులు ఏర్పాటు చేయడం, మేత పంటల సాగును విస్తరించడం, సైలేజ్, హే తయారీ, అజోల్లా సాగు, పశుగ్రాస విత్తనాల పంపిణీ, అవసరమైతే పశు శిబిరాల నిర్వహణ, పశువులకు తాగునీటి వసతుల కల్పన వంటి చర్యలు చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసింది. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జలాశయాల్లోని నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత కల్పించాలని నివేదిక పేర్కొంది. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, శాస్త్రవేత్తలు సమన్వయంతో రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సాంకేతిక సూచనలు నిరంతరం అందించాలని, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ సూచించింది. అదేవిధంగా, సేంద్రియ ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, వర్మీ కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటు, పంటలు, తాగునీరు, పశుగ్రాసం, విద్యుత్ సరఫరా, ప్రజారోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రత్యామ్నాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అవసరమైతే మార్కెట్ జోక్యంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపాదించిన ఈ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తక్షణమే అమలు చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల జీవనోపాధి, తాగునీటి భద్రత, పశుగ్రాస లభ్యత, గ్రామీణ ఉపాధి పరిరక్షణతో పాటు రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని మరింత స్థిరంగా నిలబెట్టవచ్చని కమిటీ పేర్కొంది. కార్యాచరణ ప్రణాళిక అమలుకు సుమారు రూ.802.92 కోట్ల నిధులు అవసరమవుతాయని నివేదికలో అంచనా వేసింది.

# గణేశుడు విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం

## తయారీదారులను ఆదేశించిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 30:** గణేశుడు విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం చేయాలని తయారీదారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. వినాయక చవితి సమీపిస్తుంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తయారీ దశ నుంచే భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని వారికి స్పష్టం చేశారు. గణెశిశ్ ఉత్సవాలపై హైదరాబాద్ పోలీసులు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం గురువారం నగర సీపీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన విగ్రహ తయారీదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా ఉత్సవాలు నిర్వహించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారికి సీపీ స్పష్టం చేశారు. గతేడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణెశిశ్ విగ్రహాలను ప్రతిష్టించినట్లు వివరించారు. విగ్రహాల రవాణా సమయంలో గతేడాది నాలుగు ప్రమాదాలు జరిగాయని నగర సీపీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పని సరి అని వారికి సూచించారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని తయారీదారులను కోరారు. చిన్న విగ్రహాల ప్రతిష్టాపనపై భక్తులకు అవగాహన కల్పించాలని వివరించారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో సేఫ్టీ, సురక్షితమైన విద్యుత్ వైరింగ్ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. దూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను నివారించాలని ఆదేశించారు. రవాణాకు ముందు స్థానిక ట్రాఫిక్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. విగ్రహాల బుకింగ్, రవాణా సమయం, మార్గాల వివరాలు ముందుగానే పోలీసులకు ఇవ్వాలని తయారీదారులను ఆదేశించారు. భారీ విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగలు, ఫ్లై ఓవర్లు, మెట్రో మార్గాలకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని



ఆదేశించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉప యోగించే క్రేన్లు, వాహనాలు సర్టి÷డ్ అయి ఉండాలని వారికి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వినాయకుని విగ్రహాల తయారీదారులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

# వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని అవమానించిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గేయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్‌మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయం ఆలాపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. నేడు లోక్‌సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్ వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనల నడుమ రెండు సభల్లోనూ బిల్లుకు ఆమోదం లభించింది.

# హిందుత్వ అంటే మన జీవనవిధానం

(మొదటి పేజీ తరువాయి)

వెంకయ్యనాయుడు ప్రసంగించారు. మంచి గీతాలు వినాలని, తద్వారా స్ఫూర్తిని పొందాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వందేమాతరం గీతం మనందరికీ సమాధానమని తెలిపారు. అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని సూచించారు. శక్తివంతమైన భారత్ కావాలంటే యువతి, యువకుల పాత్రే కీలకమని ఉద్ఘాటించారు. మొబైల్ ఫోన్, యూట్యూబ్‌లపై యువత ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని చెప్పుకొచ్చారు. యువత మంచి గురువును ఎంచుకోవాలని, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ఎక్కువగా చదవాలని సూచించారు. యువత తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకునే స్థాయికి ఎదగాలని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్. పి లతో సి.ఎస్ సంజయ్ జాజు గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ సి.వీ ఆనంద్, అడిషనల్ డీజీ భగవత్, డిజాస్టర్ మేనేజ్ మెంట్ కార్యదర్శి హరిచందన, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, గురువారం రాత్రి కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్నందున జిల్లాల్లో పోలీసు వివిధ శాఖలతో సమన్వయంతో తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రధానంగా, ఆయా జిల్లాలో వాటర్ ఫాల్స్, ప్రమాదకర ప్రదేశాలు ఉన్న పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల కలెక్టర్లు పరిస్థితులను ఎప్పటి కప్పుడు సమీక్షిస్తుండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఇప్పటికే, ఎన్.డీ.ఆర్.ఎఫ్, ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని, అవసరమైనప్పుడు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

సీసీ రోడ్, లో - లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# మోడీ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌గా మారాలి

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉద్ధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు.

ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పె÷-లలెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం ద్వారా బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని అభిజీత్ ఆరోపించారు.

# నిర్ణీత షెడ్యూల్ ప్రకారం యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**జిల్లాలో అత్యాధునిక సదుపాయాలతో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం**

**రఘునాథపాలెం లోని స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ బాలుర గురుకుల పాఠశాల నెలరోజుల లోపు అందుబాటులోకి రావాలి**

**విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక విద్యకు అనుగుణంగా అన్ని వసతుల కల్పన**


**ఖమ్మం నియోజకవర్గ కేంద్రంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ బాలుర గురుకుల పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి,జూలై 30:** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని రఘునాథపాలెం వైఎస్ఆర్ నగర్ ప్రధాన దారిలో రూ. 200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. స్కూల్ నిర్మాణంలో హాస్టల్స్ భవనాలు, అకాడమిక్ బ్లాక్‌లు, డార్మిటరీ భవనం, వంటగది, భోజనశాల, ప్రధాన నివాస గృహం, క్వార్టర్స్ నిర్మాణ ప్రాంతాలను కాలినడకన పరిశీలిస్తూ భవనాల పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజక వర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి అగ్రిమెంట్ ప్రకారం స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంలోనూ రాణించేలా అత్యాధునిక మౌళిక వసతులతో ఈ విద్యాసంస్థలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.పాఠశాల ఆవరణలో విద్యార్థుల రాకపోకలకు అనువుగా లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు.నిర్మాణ సంస్థలు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం రఘునాథపాలెం మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ (బాలుర) గురుకుల పాఠశాల/కళాశాల భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. నెలరోజుల లోపు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# భారీ వర్షాలకు ఇంటి గోడ కూలి తప్పింన ప్రమాదం



**తొలి అక్షరం/మహదేవ్‌పూర్జులై 30:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో భారీ వర్షాల కారణంగా ఓ ఇంటి గోడ కూలిపోవడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది.గ్రామానికి చెందిన చక్కినారపు మల్లయ్య నివాసంలోని ఇంటి గోడ గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పూర్తిగా తడిసిపోవడంతో శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలింది. ఘటన సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి బయట ఉండటంతో ప్రాణాపాయం తప్పింది.అయితే, గోడ కూలిన సమయంలో ఇంటి వద్ద పెంచుకుంటున్న నాలుగు కోళ్లు శిథిలాల కింద చిక్కుకుని మృతి చెందాయి. దీంతో బాధిత కుటుంబానికి ఆస్తి నష్టం వాటిల్లింది.బాధితుడు చక్కినారపు మల్లయ్య మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగానే గోడకూలిపోయిందని, ప్రభుత్వం స్పందించి తమ కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.సంఘటన విషయం తెలుసుకున్న మద్దులపల్లి గ్రామ సర్పంచ్ సరిత, 7వ వార్డు సభ్యురాలు శ్రీజ, 8వ వార్డు సభ్యురాలు కోరాళ్ల మనక్కా ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గ్రామంలో కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాల నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.

# కృత్రిమ మేధస్సు,మెషిన్ లెర్నింగ్ మరియు సైబర్ భద్రత అంశాలపై అవగాహన

**మందోళ్ల గూడెం ఉపసర్పంచ్ ఉపసర్పంచ్ ల ఫోరేం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు డా సుర్కంటి శ్రీధర్ రెడ్డి**

**అసోసియేట్ ప్రొఫెసర్ శ్రేయాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ తట్టియన్నారం గ్రామం, బండ్లగూడ, నాగోల్**




**తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 30:** చౌటుప్పల్ మండలం చిన్నకొండూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న 8,9,10 తరగతి విద్యార్థుల కు జీవితం లో ఒక లక్ష్యాన్ని ఎన్నుకోవాలని ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని భావితరాల కోసం ప్రపంచంతో పోటీ పడుతున్న టెక్నాలజీని స్కూల్ దశనించే నేర్చుకోవాలని తెలపడం జరిగింది చిన్న కొండూరు పాఠశాల తరపున మా విద్యార్థులకు కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, మరియు సైబర్ భద్రత అంశాలపై అత్యంత ప్రయోజనకరమైన అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు మా హృదయపూర్వక అభినందనలు మరియు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.మీరు అందించిన ప్రసంగం విద్యార్థులకు అత్యంత ఆసక్తికరంగా, విజ్ఞానవంతంగా, ప్రేరణాత్మకంగా నిలిచింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల ప్రాముఖ్యత, వాటి వాస్తవ జీవిత వినియోగాలు, భవిష్యత్తులో వాటి అవసరం, అలాగే డిజిటల్ ప్రపంచంలో సైబర్ భద్రత యొక్క కీలక పాత్రను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా మీరు వివరించడం అభినందనీయం. మీ విలువైన మార్గదర్శకత్వం విద్యార్థుల్లో సాంకేతిక విద్యపై ఆసక్తిని పెంపొందించడమే కాకుండా, నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచించే స్ఫూర్తిని కలిగించింది.మా విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మీ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి, మీ అనుభవాన్ని, నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని వారితో పంచుకోవడం మా పాఠశాలకు ఎంతో గర్వకారణం. మీ సేవలు విద్యార్థుల విద్యా ప్రగతికి చిరస్మరణీయమైన స్ఫూర్తిగా నిలుస్తాయని మేము విశ్వసిస్తున్నాము.భవిష్యత్తులో కూడా ఇలాంటి విజ్ఞానవంతమైన అవగాహన కార్యక్రమాలను మా పాఠశాలలో నిర్వహించి విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.మరోసారి మీ అమూల్యమైన సహకారానికి, విద్యార్థులకు అందించిన ప్రోత్సాహానికి మరియు విద్యాభివృద్ధికి చేసిన విశేష కృషికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, మీకు మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, వృత్తిపరంగా మరిన్ని ఉన్నత విజయాలు చేకూరాలని ఆకాంక్షిస్తున్నాము. మీకు మీ శ్రేయాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్మెంట్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు

# రేషన్ కార్డు ఈ-కేవైసీ గడువును వెంటనే పొడిగించాలి

**- ఆర్టీఐ జిల్లా అధ్యక్షులు దబ్బటి శేఖర్**



**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 30:** రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులకు సంబంధించి ఈ-కేవైసీ పూర్తి చేసేందుకు విధించిన జూలై 31 గడువును వెంటనే పొడిగించాలని సమాచార హక్కు రక్షణ చట్టం2005 యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దబ్బుటి శేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇంకా అనేక మంది రేషన్ కార్డు లబ్ధిదారులు ఆధార్ కార్డు బయోమెట్రిక్ వివరాలు నవీకరించకపోవడంతో ఈ-కేవైసీ పూర్తి చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ ప్రక్రియ పూర్తవడానికి సాధారణంగా 7 నుంచి 10 రోజుల సమయం పడుతుందని, ఈ కారణంగా అనేక మంది అర్హులైన లబ్ధిదారులు ఈ-కేవైసీ చేయించుకోలేక ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.గడువు ముగిసిపోతే నిజమైన లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి, రేషన్ కార్డు ఈ-కేవైసీ గడువును మరికొంత కాలం పొడిగించాలని దబ్బుటి శేఖర్ ఈ పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.ప్రజలందరూ కూడా తమ ఆధార్ బయోమెట్రిక్ వివరాలను వీలైనంత త్వరగా నవీకరించుకుని, ప్రభుత్వం ప్రకటించే కొత్త గడువులోపు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఉద్యోగవిరమణ అయినా ప్రధానోపాధ్యాయులు ఐలయ్యకి గణ సన్మానం






**పెద్దవంగర జులై 30 తొలి అక్షరం:** మండలంలోని బావోజీ తండ ప్రాథమిక పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు గా పనిచేస్తున్న సోమారపు ఐలయ్య ఉద్యోగ విరమణ అభినందన సభ మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో మండల విద్యా శాఖ అధికారి బుదారపు శ్రీనివాస్ సార్ అధ్యక్షతన జరిగింది.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుధీర్గ కాలంగా మండలంలో పని చేసి విద్యార్థులకు విశిష్ట సేవలు అందించారన్నారు.. చిన్నతనం నుండి పి డి ఎస్ యు లో చేరి విద్యార్థి సమస్య ల ఉద్యమించా రన్నారు అదేవిధంగా సామాజిక సమస్య ల పట్ల అనేక ఉద్యమం లు చేసారని విద్యా రంగం, ఉపాధ్యాయ సమస్య ల పట్ల పోరాడారన్నారు. మిగిలిన శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.. కార్యక్రమంలో చిట్యాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ అవతాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కళాధర్ వివిధ సంఘాల మండల బాధ్యులు యాకుబ్ పాషా,చిక్కాల సతీష్,ఎర్ర వెంకన్న,మధుసూదన్ రెడ్డి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్2027 ఉచిత కోచింగ్‌ను బీసీ యువత సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**అర్హులైన ప్రతి బీసీ అభ్యర్థి గడువులోగా లాంగ్ టర్మ్ కోచింగ్ కు దరఖాస్తు చేసుకోవాలి**

**యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్2027 ఉచిత లాంగ్ టర్మ్ కోచింగ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**



**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి,జూలై 30:** ప్రభుత్వం ప్రతిభావంతులైన బీసీ యువతకు కల్పిస్తున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్2027 ఉచిత కోచింగ్ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని, అత్యున్నత సివిల్ సర్వీసుల లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు.గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో టీజీ బీసీ స్టడీ సర్కిల్, ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్2027 దీర్ఘకాలిక ఉచిత కోచింగ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి పరిపాలనలో ప్రతిభావంతులైన యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ కోచింగ్‌ను అందిస్తూ, బీసీ విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన యువత కూడా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సర్వీసులను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగేందుకు ఈ కోచింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 2026, ఆగస్టు 24 నుంచి 2027, మే నెల వరకు పూర్తిగా ఉచిత కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు. నాణ్యమైన బోధనతో పాటు, కోచింగ్ సామగ్రి, గ్రంథాలయ సదుపాయం, కరెంట్ అఫైర్స్ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల శిక్షణ, రెగ్యులర్ పరీక్షలు, మాక్ టెస్టులు, వ్యక్తిత్వ వికాస శిక్షణ, ఇంటర్వ్యూ మార్గదర్శకత్వం వంటి అన్ని సౌకర్యాలు ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా కల్పిస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వం కోచింగ్ కార్యక్రమానికి మొత్తం 150 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వీరిలో 100 మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా, మరో 50 మందిని ఇప్పటికే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఎంపిక చేయనున్నట్లు వివరించారు.ఎంపికైన అభ్యర్థులకు స్టైపెండ్, అదనంగా ఒకేసారి పుస్తకాల గ్రాంట్ అందజేస్తామని అన్నారు. ఈ ఆర్థిక ప్రోత్సాహకాలు విద్యార్థులు పూర్తిస్థాయిలో పోటీ పరీక్షలపై దృష్టి కేంద్రీకరించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన విద్యార్థులకు కూడా ఈ సమాచారాన్ని చేరవేసేందుకు అధికారులు ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని, యువత పట్టుదలతో శ్రమిస్తే అత్యున్నత లక్ష్యాలను తప్పకుండా చేరుకోగలరని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, బీసీ,ఎస్సి, ఎస్టీ వర్గానికి చెందినవారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ 2026 ఆగస్టు 7 వరకు కొనసాగుతుందని, ఆగస్టు 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష, ఆగస్టు 19న ఫలితాలు, ఆగస్టు 21 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఆగస్టు 24 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అర్హతలు, ఎంపిక విధానం, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను టీజీ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధికారిణి జి. జ్యోతి, డైరెక్టర్ బీసీ స్టడీ సర్కిల్ గోన శ్రీలత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి మాధవి, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకట్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, టీజీ బీసీ స్టడీ సర్కిల్ ప్రతినిధులు,అధ్యాపకులు,సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్లు బాగుచేయండి... ప్రజల ప్రాణాలు కాపాడండి!

### - చౌటుప్పల్‌వలిగొండ రహదారి దుస్థితిపై ప్రజల ఆగ్రహం





**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 29:** చౌటుప్పల్‌వలిగొండ ప్రధాన రహదారి అధ్వాన్న స్థితికి చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఎక్కడ చూసినా గుంతలు, బురద, అసమాన రహదారులు దర్శనమిస్తుండటంతో ప్రతి ప్రయాణం ప్రాణాలతో చెలగాటంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ వేలాది మంది ప్రయాణించే ఈ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యంగా మారినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డు మొత్తం నీటితో నిండిపోవడంతో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికే ఈ రహదారిపై జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ రహదారి మరమ్మతుల విషయంలో నిర్లక్ష్య ధోరణి కొనసాగుతుండడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది.రోడ్లు సరిగా లేకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు మరింత పెరిగి, వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొంటున్నారు. మరోవైపు, ట్రాఫిక్ పోలీసులు ప్రధానంగా చలాన్లపైనే దృష్టి సారిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. రోడ్లు సురక్షితంగా లేకపోతే కేవలం చలాన్లు విధించడం వల్ల ప్రమాదాలు తగ్గవని, ముందుగా రహదారులను ప్రయాణానికి అనువుగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.కొత్త రహదారి పనులు చేపడుతున్న ప్రాంతాల్లో కూడా పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు, హెచ్చరిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు మరింత తీవ్రమవుతున్నాయి. ప్రజల భద్రత కంటే పనుల ఆలస్యం ఎక్కువగా కనిపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు.చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు, సంబంధిత రోడ్లుభవనాల శాఖ అధికారులు వెంటనే స్పందించి చౌటుప్పల్‌వలిగొండ రహదారిని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేయాలని, గుంతలను పూడ్చి సురక్షితమైన రాకపోకలకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.“ప్రజలకు భద్రమైన రోడ్లు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. రోడ్లు బాగుంటేనే ప్రమాదాలు తగ్గుతాయి... చలాన్లు కాదు, ముందుగా రహదారులనే సరిచేయాలి“ అని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

# అంధకారంలో బొడ్రాయి వీధి ప్రజలు

**● పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్న వీధి ● దోమలు పాముల మధ్య వీధి ప్రజలు ● పట్టించుకోని పంచాయతీ అధికారులు**



**తొలి అక్షరం /ఖమ్మం జిల్లా, ప్రతినిధి, జూలై 30:** తల్లాడ గ్రామంలోని బొడ్రాయి వీధి నందు గత కొన్ని రోజులుగా వీధి లైట్లు వెలగకపోవడంతో వీధి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు,స్థానికులు పలుమార్లు పంచాయతీ అధికారులకు, ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కాలేదంటూ వీధి ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, “పన్నులు చెల్లిస్తున్నాం కానీ ఫలితం లేదు, కానీ కనీసం లైట్లు కూడా వేయడం లేదు“ అని వీధి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం కావడంతో సాయంత్రం 6 గంటల తర్వాత వీధి మొత్తం అంధకారమయం కావడంతో రోడ్లపై విష సర్పాలు సంచరించడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నాం అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, వీధి పక్కన మరియు ఖాళీ ప్రదేశాలలో పిచ్చి మొక్కలు మొలచి అడవిని తలపిస్తుశీడడంతో దోమల బెడద ఎక్కువ అవ్వడం వల్ల తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామంటూ, వర్షాకాలం మొదలై మూడు నెలలైనా ఎటువంటి బ్లీచింగ్ గాని, క్రిమిసంహారక మందులు గాని పిచికారి చేయలేదంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, అదేవిధంగా రాత్రి సమయంలో చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఏదైనా ప్రాణనష్టం జరిగితే గాని అధికారులు స్పందించరా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాబట్టి తక్షణమే అధికారులు స్పందించి బొడ్రాయి వీధిలో సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.


# అంటువ్యాధులపై సమరం..

### పడమటి గూడెంలో పారిశుధ్య పనులు
### ముమ్మరంగా బ్లీచింగ్ పౌడర్ చల్లింపు
### రోడ్లు, మురుగు కాలువల శుద్ధీకరణ
### పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు సర్పంచ్, ఉపసర్పంచ్ అవగాహన



**తొలిఅక్షరం/నర్సింహులపేటజులై 30:** గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా పడమటి గూడెం గ్రామ పంచాయతీ సమర శంఖం పూరించింది. వర్షాకాల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో, గ్రామంలో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టారు. సర్పంచ్ ఉప్పలయ్య, ఉపసర్పంచ్ నవీన్ రెడ్డిల ప్రత్యక్ష పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఊరంతా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ముఖ్యంగా దోమలు చేరే మురుగు కాలువలు, ప్రధాన కూడళ్లు, నీరు నిలిచే లోతట్టు ప్రాంతాల్లో విస్తృతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్ మాట్లాడుతూ.. కేవలం అధికారుల చర్యల వల్లే కాకుండా, ప్రజల సహకారంతోనే స్వచ్ఛమైన గ్రామం సాధ్యమవుతుందన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఇంటి పరిసరాలను పొడిగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి,వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బందిలు తదితరులు పాల్గొన్నారు

# జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి శ్రీమతి పి. దేవి మానస జిల్లా కారాగారాన్ని సందర్శించి జైలు పరిసరాలు, ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలన




**తొలి అక్షరం /ఖమ్మం జిల్లా, ప్రతినిధి, జూలై 30:** జిల్లా న్యాయ సేవ సంస్థ, డిఎల్ఎస్ఎ, కార్యదర్శి శ్రీమతి పి, దేవి మానస జిల్లా కారగారాన్ని, సందర్శించి జైలు పరిస రాలు, ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను, పరిశీలించారుఈ సందర్భంగా‘ అండర్ ట్రయల్ ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులైన పేద అండర్ ట్రయల్ ఖైదీలు తప్పనిసరిగా జిల్లా న్యాయ సేవా సంస్థ సేవలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ప్రతి అర్హుడికి రాజ్యాంగబద్ధంగా ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ఉందని, న్యాయవాది నియామకం, న్యాయ సలహా తదితర సేవలు డీఎల్ఎస్ఏ ద్వారా ఉచితంగా అందించబడుతున్నాయని వివరించారు. ఖైదీల హక్కుల పరిరక్షణతో పాటు, న్యాయం అందరికీ చేరువ చేయడమే న్యాయ సేవా సంస్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు.జిల్లా కారాగార సూపరింటెండెంట్ శ్రీధర్ జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాకాలంలో అప్రమత్తతే ప్రాణ రక్షణ రైతులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### - ఇ ఎల్ వి భాస్కర్ ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మునుగోడు నియోజకవర్గం

**తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 30:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఇ ఎల్ వి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, మునుగోడు నియోజకవర్గ సామాజిక సేవకులు ఇ ఎల్ వి భాస్కర్ విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పొలాలు, చెరువులు, వాగులు, కాలువలు నీటితో నిండిపోతున్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే సమయంలో విద్యుత్‌తో నడిచే వ్యవసాయ బావుల మోటర్ల వద్ద అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.వర్షాల సమయంలో విద్యుత్ తీగలు తెగిపడినా, మోటార్లకు లీకేజీ ఏర్పడినా ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అందువల్ల విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేసిన తర్వాతే మోటార్లను పరిశీలించాలని, తడి చేతులతో లేదా నీటిలో నిలబడి విద్యుత్ పరికరాలను తాకరాదని రైతులకు సూచించారు.అదేవిధంగా వాగులు, వంకలు, చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో వాటిని దాటే ప్రయత్నం చేయరాదని, పిల్లలను నీటి ప్రవాహాల దగ్గరకు వెళ్లనివ్వరాదని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాలను నివారించగలమని, ప్రజల ప్రాణాలు అత్యంత విలువైనవని ఐఎల్వీ భాస్కర్ పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రతి కుటుంబం జాగ్రత్తలు పాటిస్తూ తమతో పాటు ఇతరుల భద్రతపైనా దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఐఎల్వీ ఫౌండేషన్ తరఫున వర్షాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి సురక్షితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.



# లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

### అధ్యక్షులుగా తంగేళ్లపెల్లి మల్లికార్జున చారి. ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి మధుసూదన్ రెడ్డి. కోశాధికారి జలగం సతీష్.
### ప్రమాణ స్వీకారం చేపించిన లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్ సుధాకర్ రెడ్డి.




**పెద్దవంగర జులై 30 తొలి అక్షరం:** మండల కేంద్రంలో సాయి గార్డెన్ లో జరిగిన లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర నాలుగవ సంవత్సర లయన్స్ క్లబ్ ఇన్స్టాలేషన్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది సభ అధ్యక్షులు మల్లికార్జున చారి మాట్లాడుతూ లయన్స్ సేవలు పేద ప్రజలకు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ నీరుపేదలకు కంటి పరీక్షలు ఆపరేషన్ ప్రాథమిక పాఠశాల లో పెన్నులు నోట్ బుక్స్ లు మరెన్నో నిరంతరం సేవలు చేస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తూ మా యొక్క సేవలు ప్రజలలో గుర్తింపు పొందిన విధంగా ఉండేటట్లుగా పెద్దలు జిల్లా గవర్నర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో లయన్స్ డిస్టిక్ ఇన్స్టాలేషన్ ఆఫీసర్ హరికృష్ణ రెడ్డి. లయన్స్ డిస్టిక్ సెకండ్ గవర్నర్ వేమూరి రమణారెడ్డి.లయన్స్ రీజన్ అడ్వైజర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి. లయన్స్ రిజియన్ అడ్వైజర్ లక్ష్మీనరసింహారావు.లయన్ డిస్ట్రిక్ట్ కాంబినేట్ సెక్రటరీ పాము శ్రీనివాస్.లయన్ డిస్ట్రిక్ట్ కాంబినేట్ ట్రెజరర్ చొప్పరి సోమయ్య ప్లాన్ డిస్టిక్ జిఎస్టి కోఆర్డినేటర్ వెంకటరెడ్డి. కోఆర్డినేటర్ డిస్టిక్ జెట్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద. రిజియాన్ చైర్మన్ దామెర సరేష్.రిజియన్ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి. జెర్సీ చిదిరాల నవీన్ కుమార్.లయన్ జోన్ చైర్ పర్సన్ ఈ శ్రీనివాస్.ప్రోగ్రాం చైర్మన్ ముత్తినేని శ్రీనివాస్. కోచ్ చైర్మన్ ఎర్ర వెంకన్న. లక్ష్మి నారాయణ. రాపోలు శ్రీనివాస్. గుల్లపెల్లి సదానందం. అనపురం రవి. ఎదునూరి రేణుక. మొర్రిగారుదుల శ్రీనివాస్. సుభాష్ చంద్ర బోస్ పాల్గొన్నారు

# బైర్యాన్‌పల్లి ఆలయ రథచక్రాల అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం



### ఆధ్యాత్మిక సేవలో మరోసారి ముందున్న బీసీ సేన జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీను



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 30:** ఆలయాల అభివృద్ధి అనేది కేవలం నిర్మాణాలకే పరిమితం కాకుండా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కూడా దోహదపడుతుందని బీసీ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీను అన్నారు. కేశంపేట మండలం బైర్కాన్‌పల్లి గ్రామంలోని ఆలయ రథచక్రాల అభివృద్ధి కోసం ఆయన రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం, సామాజిక ఐక్యతను పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. భక్తులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆలయాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజ హితం, ధార్మిక కార్యక్రమాల అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. సదర్ శ్రీను అందించిన విరాళానికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం రథచక్రాల నిర్మాణం, ఆలయ అభివృద్ధి పనులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన సదర్ శ్రీను సేవలు ప్రశంసనీయమని అభినందించారు.ఈ సమావేశంలో స్థానిక, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్ ఓటర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి

### - బిఆర్ఎస్ యువజన నాయకులు మచ్చ నవీన్ కుమార్



**తొలి అక్షరం :వలిగొండ, జులై 30:** సర్ ప్రక్రియలో భాగంగా, ఓటును నమోదు చేసుకోవాలని, సకాలంలో తమ పత్రాలను నింపి అధికారులైన బి ఎల్ వో లకు త్వరగా ఇవ్వాలని, లేకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందవని ఆగస్టు మూడో తారీకు లోపు వారికి అందజేయాలని అన్నారు,.

# భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

- కాటం నరసింహ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోరిగే సోములు



**తొలి అక్షరం/రామన్నపేట జులై 30:** అనారోగ్యంతో మరణించిన భవన నిర్మాణ కార్మికుడు కాటం నర్సింహ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొరిగే సోములు డిమాండ్ చేశారు. రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కాటం నర్సింహ అనారోగ్యంతో మృతి చెందగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పూల మాల వేసి జోహార్లు అర్పించి కుటుంబానికి 6500/- రూ ఆర్థిక సహకారం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ వృత్తినే నమ్ముకొని జీవిస్తూ ఆరోగ్యం చెడిపోవడంతో చికిత్స చేయించుకునే స్తోమత లేక మరణించాడని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వంగాల మారయ్య, బుడ్డ ప్రసాద్, నాయకులు బాకీరు చెన్నయ్య,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరోజు రాజశేఖర్
- అర్హులైన వారంతా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పిలుపు
- ఆగస్టు 3 వ తేదీయే చివరి గడువు



**తొలిఅక్షరం/నర్సింహులపేట జులై 30:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరోజు రాజశేఖర్ పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క పౌరుడు ఓటు హక్కును నమోదు చేసుకోవడం వారి ప్రాథమిక కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు.కొత్త ఓటర్లు తమ పూర్తి వివరాల జాబితాను ఆగస్టు 3వ తేదీ లోపల తమ పరిధిలోని బూత్ లెవెల్ అధికారులకు (బిఎల్ఓ) కు సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైనదని, ఓటు హక్కు లేని పక్షంలో ప్రభుత్వం అమలు చేసే వివిధ రకాల సంక్షేమ పథకాలను కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు.

# షాద్‌నగర్ లక్ష్య అథ్లెట్లకు రాష్ట్రస్థాయిలో మెరిసిన విజయాలు

- లక్ష్య అథ్లెట్ల లక్ష్యం సాకారం.. జాతీయ పోటీలకు దేవి ప్రియ, సుప్రజిత్






**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 30:** షాద్‌నగర్‌కు చెందిన ఈనాడు లక్ష్య అథ్లెట్లు సీబీఎస్ఈ క్లస్టర్ స్టేట్ అథ్లెటిక్స్ మీట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. జులై 25 నుంచి 30 వరకు ఘట్‌కేసర్‌లోని నల్లా మల్లారెడ్డి స్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన అథ్లెట్లు పాల్గొన్నారు.17 సంవత్సరాల లోపు బాలికల విభాగంలో పోటీపడిన జె. దేవి ప్రియ 200 మీటర్ల పరుగును 27.56 సెకన్లలో పూర్తి చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే 100 మీటర్ల పరుగులో 12.67 సెకన్ల టైమింగ్‌తో కాంస్య పతకాన్ని సాధించి తన ప్రతిభను చాటింది.14 సంవత్సరాల లోపు బాలుర విభాగంలో సుప్రజిత్ హైజంప్‌లో 1.30 మీటర్ల ఎత్తు దాటి రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ ప్రదర్శనతో ఇద్దరు అథ్లెట్లు అక్టోబర్ 20 నుంచి పంజాబ్‌లో జరగనున్న సీబీఎస్ఈ జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించారు.ఈ సందర్భంగా కోచ్ పాండు నాయక్ మాట్లాడుతూ, క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేసి ఈ విజయాలు సాధించారని తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి షాద్‌నగర్‌కు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజేతలను తల్లిదండ్రులు, క్రీడాభిమానులు, స్థానిక ప్రముఖులు అభినందించారు.

# పశువుల దొడ్డిలో చోరీ.. రైతు కుటుంబానికి తీరని నష్టం

- పొలం వద్ద కట్టేసిన ఆవు లేగదూడ మాయం..
- సిరిసల శ్రీను రైతు పోలీసులకు ఫిర్యాదు





**తొలి అక్షరం/నందిగామ, జులై 30:** నందిగామ మండలం మోత్కూలగూడ గ్రామంలో ఓ రైతుకు చెందిన ఆవు లేగదూడను గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. బాధిత రైతు సిరిసాల శీను తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి తమ పొలం వద్ద ఉన్న పశువుల దొడ్డిలో ఆవు, లేగదూడను కట్టేసి ఇంటికి వెళ్లారు.గురువారం ఉదయం తిరిగి వచ్చి చూడగా లేగదూడ కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో స్థానిక నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పశువుల పెంపకమే తమ కుటుంబానికి ప్రధాన జీవనాధారమని,ఆవు లేగదూడ చోరీ కావడంతో దాదాపు 150000రూపాయల వరకు తీవ్ర నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టి, చోరీకి పాల్పడిన నిందితులను గుర్తించి ఆవు,లేగదూడను స్వాధీనం చేసి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువుల చోరీలు పెరగకుండా పోలీసులు రాత్రి వేళల్లో గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలని స్థానిక రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# దొంగతనం కేసును ఛేదించిన కేశంపేట్ పోలీసులు

## ముసలి మహిళలే టార్గెట్‌గా గొలుసు దొంగతనాలు

## రెండు బంగారు గొలుసులు,ఒక మోటార్‌సైకిల్ స్వాధీనం





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 30:** షాద్ నగర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి కేసు వివరాలను వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధితో పాటు మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో వరుసగా జరిగిన గొలుసు దొంగతనాలు, మోటార్‌సైకిల్ చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర ముఠాను కేశంపేట్ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు.పోలీసులు నిందితుల నుంచి రెండు బంగారు మంగళసూత్రాలు,ఒక మోటార్‌సైకిల్ (TS06FC2338),మొబైల్ ఫోన్లు,రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన నిందితులు,సుఖ్‌దేవ్ సింగ్ (38), పంజాబ్,షంషేర్ సింగ్ (36), పంజాబ్,మన్‌ప్రీత్ సింగ్ (24), పంజాబ్,**మహిళలే లక్ష్యంగా దొంగతనాలు** కేశంపేట్ మండలంలోని సంతాపూర్, మక్తమాదారం ప్రాంతాల్లో కూలి పనులకు కాలినడకన వెళ్తున్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని నిందితులు మోటార్‌సైకిల్‌పై వచ్చి దారి అడిగినట్లు నటిస్తూ మెడలోని బంగారు గొలుసులు లాక్కెళ్లినట్లు పోలీసులు తెలిపారు.మరో ఘటనలో మహిళలను తోసివేసి మూడు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించినట్లు వెల్లడించారు.౦**హార్వెస్టర్ ఆపరేటర్ల ముసుగులో నేరాలు**నిందితులు పంటల సీజన్‌లో హార్వెస్టర్ మిషన్ ఆపరేటర్లుగా పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో సంచరించేవారని, స్థానిక రహదారులు, తప్పించుకునే మార్గాలపై అవగాహన పెంచుకుని అదే అవకాశాన్ని ఉపయోగించుకుని గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందని సీపీ తెలిపారు. **మహబూబ్నగర్,కొత్తకోట, కేశంపేట్, కడ్తాల్‌లో వరుస నేరాలు** మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోటలో మోటార్‌సైకిల్ దొంగిలించి,అదే వాహనంతో గొలుసు దొంగతనం చేసినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం నాందేడ్‌లో కలుసుకున్న ముగ్గురు నిందితులు కలిసి తెలంగాణలో మరిన్ని నేరాలకు కుట్ర పన్నారు. సికింద్రాబాద్‌కు రైలులో వచ్చి, అక్కడి నుంచి మోటార్‌సైకిల్ చోరీ చేసి కేశంపేట్, కడ్తాల్ ప్రాంతాల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడ్డారు.మరో నేరానికి సిద్ధమవుతున్న సమయంలో షాద్‌నగర్ సమీపంలోని కేశంపేట్ క్రాస్‌రోడ్ వద్ద పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు..ఈ కేసులను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి పర్యవేక్షణలో, షాద్‌నగర్ డీసీపీ శిరీష రాఘవేందర్, ఏసీపీ లక్ష్మీనారాయణ మార్గదర్శకత్వంలో, నిజామాబాద్ పోలీసుల సహకారంతో కేశంపేట్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు.**షాద్‌నగర్ పోలీసుల మరో విజయం**ఇటీవల షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హెచ్‌బీ బై నైట్ కేసును కూడా పోలీసులు ఛేదించారు.ఈ కేసులో 18 తులాల బంగారం, 7 తులాల వెండి,30 వేల నగదు స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అలాగే పలు బైక్ చోరీ కేసులను కూడా ఛేదించి మూడు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.ప్రజలు ఆస్తి సంబంధిత నేరాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా పోలీసులకు సహకరించాలని సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిసిపి శిరీష రాఘవేందర్, షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ, కేశంపేట్ సిఐ నరహరి, ఎస్సై రాజ్ కుమార్, క్రైమ్ టీం మరియు కేశంపేట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సేవలకు గుర్తింపు: జిల్లా ఫోరం జాయింట్ సెక్రటరీగా పెరుమాండ్ల

## బ్రాహ్మణ కొత్తపల్లి సీనియర్ జర్నలిస్ట్ చంద్రమౌళి గౌడ్‌కు కీలక బాధ్యతలు

## ఉత్తర్వులు అందజేసిన జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు

## ఉద్యమకారుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్న చంద్రమౌళి

**తొలిఅక్షరం/మహబూబాబాద్, జులై 30 :** మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పెరుమాండ్ల చంద్రమౌళి గౌడ్‌కు కీలక బాధ్యతలు దక్కాయి. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహబూబాబాద్ జిల్లా జాయింట్ సెక్రటరీగా ఆయన నియమితులయ్యారు. ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజనీకాంత్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు నియామక ఉత్తర్వులను జారీ చేసి అందజేశారు.స్వరాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ ఉద్యమంలో పెరుమాండ్ల చంద్రమౌళి గౌడ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమ నేతగా ముందుండి నడిచారు. ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొంటూ ప్రజలను చైతన్యపరిచారు. ఉద్యమకారులకు దిశానిర్దేశం చేస్తూ, రాష్ట్ర సాధన కోసం జరిగిన ప్రతి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో చురుకైన పాత్ర పోషించారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన చేసిన నిరంతర సేవలను గుర్తించిన ఫోరం అధిష్ఠానం జిల్లా జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించింది.ఈ సందర్భంగా చంద్రమౌళి గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజనీకాంత్, జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు కుమ్మరికుంట్ల మౌనేందర్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వరాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా వ్యవహరిస్తూ, జిల్లా వ్యాప్తంగా సంస్థ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తానని స్పష్టం చేశారు.తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు కుమ్మరికుంట్ల మౌనేందర్తో పాటు పలువురు ఉద్యమకారులు, ఫోరం నాయకులు పాల్గొన్నారు.



# భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఎస్ఐఆర్ మండల ప్రవాస్ అభియాన్ కార్యక్రమం

- బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్.






**తొలి అక్షరం/వలిగొండ, జులై 30:** బిజెపి శక్తి కేంద్రాల ప్రబారీల, మండల పదాధికారుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీ పాశం భాస్కర్ గారు హాజరైనారు. వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణం బలంగా ఉన్నప్పుడే పార్టీ ప్రతిష్ఠంగా ఎదుగుతుందని అందుకు అనుగుణంగా ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా పార్టీ కోసం పనిచేయాలని వారు తెలియజేశారు. శక్తి కేంద్రాల వారిగా సర్ ప్రక్రియను బి ఎల్ ఎ టు కలిసి వలిగొండ పట్టణంలో మరియు లోతుకుంట గ్రామంలో పర్యవేక్షించడం జరిగింది. అక్కడ బి ఎల్ ఓ ద్వారా సర్ ప్రక్రియ నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని అందుకు ఆ పార్టీ బి ఎల్ ఎ ల సహకారం తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్ అసెంబ్లీ కో కన్వీనర్ రాచకొండ కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మైసొల్ల రామ నర్సు, జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి, కనతాల అశోక్ రెడ్డి,కందుల తానేష, మంద నరసింహ, బందారపు రాములు, రావుల పద్మారెడ్డి, పాక పుల్లయ్య, బొడిగే ఆనంద్, బచ్చు శ్రీనివాస్, మండల పదాధికారులు మందడి రంజిత్ రెడ్డి, లోడే లింగస్వామి గౌడ్, గంగాధర్ దయాకర్, ఎదురుగట్ల వెంకటేశం, శ్రీనివాస్, గోగు మహేష్, వార్డ్ మెంబర్లు దంతూరి అరుణ్, వీరాచారి, బుంగ మట్ల మహేష్, మైసొల్ల చిన్న మచ్చ గిరి, దయ్యాల వెంకటేష్, ఎర్రవోలు జంగయ్య వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర , ఇన్చార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండి. ఇబ్రహీంకు ఘన సన్మానం

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 30:**

షాద్‌నగర్, జూలై 30: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ఎండి. ఇబ్రహీంను పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. విట్యాల రవీందర్ గౌడ్, వెంకటేష్ (రాజు), నిర్దవెల్లి డిప్యూటీ సర్పంచ్ ఎండి. ఆమెర్, ఇసాక్ కలిసి శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, కార్యకర్తల సంక్షేమానికి ఎండి. ఇబ్రహీం సమర్థవంతంగా పనిచేసి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం ఎండి. ఇబ్రహీం మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలుపుతూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధి, ప్రజాసేవ కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# మల్కాజిగిరి పరిధిలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

**- 2,489 కేసులు నమోదు..**

**రూ.2.58 లక్షల జరిమానా వసూలు**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై30:** మల్కాజిగిరి ట్రాఫిక్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు గురువారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.రహదారి భద్రతను మెరుగుపరచడం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరికట్టడమే లక్ష్యంగా ఈ డ్రైవ్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి సీపీ బి.సుమతి ఐపీఎస్ మార్గదర్శకత్వంలో ట్రాఫిక్ డీసీపీలు కె.రాహుల్ రెడ్డి, వి.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏసీపీలు,ఇన్స్పెక్టర్లు, ఇతర సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొని నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల సందర్భంగా వేర్వేరు ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 2,489 కేసులు నమోదయ్యాయి. **యూనిఫాం ధరించకపోవడం:** డ్యూటీలో ఉంటూ నిర్దేశిత యూనిఫాం ధరించని వాణిజ్య వాహనాల డ్రైవర్లపై అత్యధికంగా 1,735 కేసులు నమోదు చేసి, రూ.1,73,500 జరిమానా విధించారు. **పరిమితికి మించిన అంచులు (ఎక్స్‌ట్రా ప్రొజెక్షన్):** వాహనాలకు పరిమితికి మించి సరుకులు,రాడ్లు పొడుచుకు వచ్చేలా రవాణా చేస్తున్న వారిపై 453 కేసులు నమోదు చేసి రూ.54,300 జరిమానా వేశారు. **అనుమతి లేని పైలటింగ్:** ప్రైవేటు వాహనాలతో అక్రమంగా పైలటింగ్ నిర్వహిస్తున్న వారిపై 178 కేసులు నమోదు చేసి రూ.17,800 ఫైన్ విధించారు. **ఓవర్‌లోడింగ్:** పరిమితికి మించి సరుకులు రవాణా చేస్తున్న లారీలు, ఇతర వాహనాలపై 123 కేసులు నమోదు చేసి రూ.12,300 జరిమానా విధించారు. కమిషనరేట్ పరిధిలోని ప్రధాన జంక్షన్లు, జాతీయ, రాష్ట్ర రహదారులు, కమర్షియల్ హబ్‌లు, ఇండస్ట్రియల్ ఏరియాలు,విద్యాసంస్థల సమీపంలో ఈ తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. ఓవర్‌లోడింగ్ వల్ల వాహనాల బ్రేకింగ్ సామర్థ్యం దెబ్బతిని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, అదనపు ప్రొజెక్షన్లు పాదచారులకు, ఇతర వాహనదారులకు తీవ్ర ప్రమాదకరమని ట్రాఫిక్ డీసీపీ లు పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వారిపై భవిష్యత్తులోనూ ఇలాంటి చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

Malkajgiri Commissionerate
Special Drive Cases against Overloading in goods vehicles, Extra projections,Piloting & W/o Uniform Dt: 30-07-2026.

| Sl. No. | Police Station | Over loading Cases | | Extra projections | | Piloting Cases | | W/o Uniform | | Total | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | Imposed Cases | Imposed Amount | Imposed Cases | Imposed Amount | Imposed Cases | Imposed Amount | Imposed Cases | Imposed Amount | Imposed Cases | Imposed Amount |
| 1 | Malkajgiri Tr PS | 8 | 800 | 12 | 1200 | 13 | 1300 | 135 | 13500 | 168 | 16800 |
| 2 | Gopalpuram Tr PS | 19 | 1900 | 46 | 4600 | 59 | 5900 | 106 | 10600 | 230 | 23000 |
| 3 | Jawaharnagar Tr PS | 1 | 100 | 15 | 3300 | 4 | 400 | 36 | 3600 | 56 | 7400 |
| 4 | Trimulgherry Tr PS | 14 | 1400 | 48 | 5700 | 15 | 1500 | 234 | 23400 | 311 | 32000 |
| 5 | Alwal Tr PS | 10 | 1000 | 71 | 9800 | 14 | 1400 | 174 | 17400 | 269 | 29600 |
| 6 | Begumpet Tr PS | 20 | 2000 | 50 | 6800 | 18 | 1800 | 617 | 61700 | 705 | 72300 |
| Traffic Zone-I | | 72 | 7200 | 242 | 31400 | 123 | 12300 | 1302 | 130200 | 1739 | 181100 |
| 1 | LB Nagar Tr PS | 3 | 300 | 64 | 7300 | 10 | 1000 | 112 | 11200 | 189 | 19800 |
| 2 | Vanasthalipuram Tr PS | 17 | 1700 | 21 | 3000 | 24 | 2400 | 93 | 9300 | 155 | 16400 |
| 3 | Uppal Tr PS | 29 | 2900 | 83 | 8300 | 19 | 1900 | 142 | 14200 | 273 | 27300 |
| 4 | Kushaiguda Tr PS | 2 | 200 | 33 | 3300 | 0 | 0 | 60 | 6000 | 95 | 9500 |
| 5 | Ghatkesar Tr PS | 0 | 0 | 10 | 1000 | 2 | 200 | 26 | 2600 | 38 | 3800 |
| Traffic Zone-II | | 51 | 5100 | 211 | 22900 | 55 | 5500 | 433 | 43300 | 750 | 76800 |
| Grand Total (I&II) | | 123 | 12300 | 453 | 54300 | 178 | 17800 | 1735 | 173500 | 2489 | 257900 |

Sections:
Overloading in goods vehicles & Extra projections (S 184, 422/177)
Piloting with Driver (S 125/177)
W/o Uniform (S 177(4))

# శాన్విత్ పుట్టినరోజు వేడుకల్లో డాక్టర్‌గా ఎదగాలంటూ తాతా నానమ్మ ఆశీస్సులు!

**ప్రజోపకారకుడై, పేదలకు వైద్యం అందించే గొప్ప డాక్టర్‌గా ఎదగాలి: మనవడిని దీవించిన తాతా నానమ్మలు**

**బంధుమిత్రులు, ఆశీస్సుల నడుమ అంబరాన్ని అంటిన నిజాంపేట్ సంబరాలు**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జూలై 30:** సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే పెద్దల కలలు, చిన్నారుల అల్లరి కేరింతల నడుమ నిజాంపేట్ హౌసింగ్ సొసైటీ ప్రాంతం ఒక చిన్నారి పుట్టినరోజు వేడుకతో పులకించిపోయింది. శ్రీరామ్ – కావ్య దంపతుల ముద్దుల కుమారుడు శాన్విత్ మొదటి జన్మదిన వేడుక అక్షరాలా ఒక కుటుంబ పండుగలా కన్నుల పండువగా సాగింది. పూల అలంకరణలు, రంగురంగుల విద్యుత్ కాంతుల మధ్య జరిగిన ఈ వేడుకకు విచ్చేసిన ప్రతి ఒక్కరి మోహంలోనూ ఆనందం స్పష్టంగా కనిపించింది.ఈ వేడుకలో అత్యంత భావోద్వేగభరితమైన ఘట్టం శాన్విత్ తాత కృష్ణ ఆశీర్వాదం. మనవడి తొలి పుట్టినరోజు సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "మా మనవడు శాన్విత్ కేవలం మా ఇంటి దీపమే కాదు, సమాజానికి ఒక ప్రజోపకారి కావాలి. భవిష్యత్‌లో ఒక గొప్ప డాక్టర్‌గా ఎదిగి, ఆర్థికంగా వెనుకబడిన పేద ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలందించి వారి ప్రాణాలు నిలపాలి" అని తన మనసులోని ఆశయాన్ని పంచుకున్నారు.అలాగే, నానమ్మ ఆశీస్సులు కూడా అదే ఉన్నతమైన ఆశయానికి ప్రతిరూపంగా నిలిచాయి. ఆమె ఎంతో ఆప్యాయంగా మనవడిని దీవిస్తూ... "మా బంగారు కొండ ఉత్తమ ప్రయోజకుడై, సమాజం మెచ్చే డాక్టర్‌గా పేరు తెచ్చుకోవాలి. పేదవారి కష్టాలను తీర్చే వైద్యుడిగా ఎదిగి ఆ దేవుడి దయతో కలకాలం చల్లగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ఆశీర్వదించారు.చిరుప్రాయంలోనే ఇటువంటి గొప్ప సేవా దృక్పథం ఉన్న ఆశీస్సులు అందుకోవడం శాన్విత్ అదృష్టమని హాజరైన బంధుమిత్రులు కొనియాడారు. చిన్నారి చేత కేక్ కట్ చేయించి, అతిథులందరికీ ఆత్మీయంగా విందు భోజనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామ్ – కావ్య దంపతులు తమ ఆనందాన్ని అందరితో పంచుకుంటూ ఈ తొలి పుట్టినరోజు వేడుకను మధుర జ్ఞాపకంగా మలచుకున్నారు.





# రామన్నపేట మండల స్థాయి సమీక్ష సమావేశం




**తొలి అక్షరం/రామన్నపేట జులై 30:** రామన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జలసిరి కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయడం అరుతడి (ప్రత్యామ్నాయ) పంటల సాగును ప్రోత్సహించడంపై అధికారులు చర్చించి పలు సూచనలు చేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శోభారాణి మాట్లాడుతూ, కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రతి గ్రామంలో జలసిరి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి రైతు పొలంలో ఫామ్ పాండ్ (పత్తి కుంట), ప్రతి గ్రామానికి ఊట కుంట నిర్మాణం చేపట్టడంతో పాటు, రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని సర్పంచులు మరియు సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాఘవరెడ్డి ఎంపీడీఓ రాములు , తహసీల్దార్ లాల్ బహదూర్ శాస్త్రి ఎంపీఓ రఫీ , ఏపీఓ వెంకన్న , ఏఐఏ ఏజాజ్ అలీ ఖాన్ ఏపీఎం జానీ అలాగే మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సంఘం అధ్యక్షురాలు సి.సిలు, ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.






# పెద్ది ఎందుకు బతకాలి

**తొలి అక్షరం/రామన్నపేట జూలై 30:** యశోద అసుపత్రిలో చావుతో యుద్ధం చేస్తున్నఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఎందుకు బతకాలి.. తెలంగాణ పోరాటంలో వరంగల్లు ఉద్యమకారులకు అండగా ఆత్మీయుడిగా ముందు నిలబడి కలబడి అందరి వాడైనందుకు పెద్ది బతకాలి.. నల్లబెల్లిలో బయలెల్లి అసెంబ్లీ దాక చేరడానికి అలుపెరుగని పోరాటం చేసి రాజకీయాల్లో అందరూ రాణించొచ్చని చూపినందుకు పెద్ది బతకాలి.. ప్రభుత్వంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షంలో ఉండి నిరంతరం సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేసినందుకు పెద్ది బతకాలి.. ఆధిపత్య కులంలో పుట్టినప్పటికీ ఆ వాసనలు వదిలేసి ఆదర్శ వివాహం చేసుకొనిసమాజానికి ఆదర్శంగా మారినందుకు పెద్ది బతకాలి... అస్వస్థత విషయం తెల్వగానేపార్టీలకతీతంగా సిద్ధాంతాలకతీతంగా తెలంగాణ మొత్తం స్పందించేలా.. అందరివాడు పెద్ది అజాతశత్రువు పెద్ది అనిపించుకున్నందుకు పెద్ది బతకాలి..

**- డాక్టర్ ఫిరోజ్ కాకతీయ యూనివర్సిటీ**



# ఎల్జీ "ఓఎల్ఇడి ఏఐ" అత్యాధునిక టీవీలు ఆవిష్కరణ

**తొలి అక్షరం/కాజీపేట, జూలై 30:**హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా తన కొత్త తరం అత్యాధునిక ' ఓఎల్ఇడి ఏఐ' టీవీలను కాజీపేట మార్కెట్‌లోకి గురువారం అధికారికంగా విడుదల చేసింది. కాజీపేట డి-మార్ట్ సమీపంలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ కోల శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోల శ్రీధర్ మాట్లాడుతూ... అత్యాధునిక ఆల్ఫా ఓఎల్ఇడి ఏఐ ప్రాసెసర్, ప్రపంచ స్థాయి ఓఎల్ఇడి డిస్‌ప్లే సాంకేతికతతో రూపొందించిన ఈ టీవీలు వినియోగదారులకు సరికొత్త వీక్షణ అనుభూతిని అందిస్తాయని తెలిపారు. సహజ సిద్ధమైన రంగులు, పర్‌ఫెక్ట్ బ్లాక్ లెవెల్స్, పిక్చర్ క్వాలిటీ వీటి ప్రత్యేకత అని వివరించారు.అలాగే ఈ టీవీల్లో ఏఐ పిక్చర్ ప్రో, ఏఐ సౌండ్ ప్రో, అప్‌డేటెడ్ webOS స్మార్ట్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు గేమింగ్ ప్రియుల కోసం హై-రిఫ్రెష్ రేట్, లో-ల్యాటెన్సీ వంటి పలు ప్రీమియం ఫీచర్లు ఉన్నాయని పేర్కొన్నారు. **అందుబాటులో ఉన్న సైజులు** C-సిరీస్: 42, 48, 55, 65, 77, 83 అంగుళాలు G-సిరీస్: 55, 65, 77, 83, 97 అంగుళాలు ఉన్నాయి.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్ మేనేజర్ రఘువీర్, స్టోర్ మేనేజర్ స్వామి, సందీప్, ఎల్జీ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీవీ మోడళ్ల ప్రత్యేకతలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

# కరీంనగర్ కళాకారుల బోనాల జాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**- ఆగస్టు 5న బోనాల ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలకు ఘన ఏర్పాట్లు**



**తొలి అక్షరం/కరీంనగర్ జూలై 30 :** కరీంనగర్ కళాకారుల ఆధ్వర్యంలో ఆగస్టు 5వ తేదీన నిర్వహించనున్న కరీంనగర్ కళాకారుల బోనాల జాతర పోస్టర్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఆగస్టు 5న ఉదయం 9 గంటలకు గీతాభవన్, తెలంగాణ చౌక్ నుంచి బోనాల ర్యాలీ ప్రారంభమై కోతిరంపూర్ పోచమ్మ ఆలయం వరకు కొనసాగుతుందని, అక్కడ అమ్మవారికి బోనాలను సమర్పించనున్నట్లు తెలిపారు.అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు (ఆటపాట) నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని బోనాల జాతరను విజయవంతం చేయాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గోగుల ప్రసాద్, బాబు గౌరవేణి, సంతోష్ తమ్మిశెట్టి, అభినవ్ కొత్తకొండ, తిప్పబత్తిని రవి, చిలివేరి శ్రీకాంత్, యతిరాజు, దేవరాయ శ్రీనివాస్, దాసం అజయ్, సంద స్వప్న, గాజుల ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగ శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం,అర్చన,పల్లకి సేవ..

**• శ్రవణ నక్షత్రం పురస్కరించుకొని జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కళ్యాణ మహోత్సవం**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 30:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో జానంపేట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ప్రతి నెల శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా,ఆషాడ మాసం పాడ్యమి గురువారము రోజున వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణం అంగర వంగ వైభవంగా నిర్వహించిన వేద బ్రాహ్మణోత్తములు, స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్న పాలది విజయనిర్మల శివకుమార్, జ్యోతి గంగాధర్, భాగ్యరేఖ భూపాల్ రెడ్డి, సుమతి సురేందర్ రెడ్డి దంపతులు.. కల్యాణ మహోత్సవంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, పుర ప్రముఖులు సాయిశ్వర్ రెడ్డి,బార్ కౌన్సిల్ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, 16వ వార్డ్ కౌన్సిలర్ఒగ్గు జయలక్ష్మి కిషోర్, రాంభూపాల్,బాలరాజ్,కల్వ సతీష్, ప్రవీణ్, వందలాది సంఖ్యలో భక్తులు పాల్గొని ఆద్యాంతం శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించి,పల్లకి సేవలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.



# ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్

చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి తప్పుకున్న స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు జాక్‌పాట్ తగిలింది. తంతే బూరెల బుట్టలో పడ్డట్టు.. ఏకంగా ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్ పదవి వరించింది. 18 ఏళ్ల తర్వాత ఫ్లెమింగ్‌పై సీఎస్‌కే వేటు వేగయా.. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు.. హెడ్ కోచ్‌గా స్వాగతం పలికింది. ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ సారథిగా తిరిగి జోరూట్‌ను ఎంపిక చేసింది.బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికడంతో అనుభవం కలిగిన జోరూట్‌కే ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) మళ్లీ సారథ్య బాధ్యతలు కట్టబెట్టింది. బ్రెండన్ మెక్‌కల్లమ్ స్థానంలో స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను టెస్ట్ టీమ్ కోచ్‌గా నియమించింది. ఈ మేరకు ఈసీబీ గురువారం ఒక ప్రకటనను విడుదల చేసింది. స్టీఫెన్ ఫ్లెమింగ్ నియామకాన్ని ఈసీబీ బోర్డు ప్యానెల్ ఏకగ్రీవంగా ఆమోదించిందని పేర్కొంది. క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన కోచ్‌ల్లో ఒకరైన ఫ్లెమింగ్ రాకతో టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లండ్‌కు ఒక కొత్త శకం మొదలవుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇంగ్లండ్ టెస్ట్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని ఫ్లెమింగ్ తెలిపాడు. 'టెస్ట్ కోచ్‌గా ఇంగ్లండ్ జట్టులో చేరబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కోచింగ్ పదవుల్లో ఇది ఒకటి. అలాంటి పదవి బాధ్యతలను చేపట్టడాన్ని గౌరవంగా భావిస్తున్నా. ఆటగాళ్లతో పని చేయడానికి, బ్రెండన్ మెక్‌కల్లమ్, బెన్ స్టోక్స్ సాధించిన ప్రగతిని




కొనసాగించేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. స్వల్ప కాలిక, దీర్ఘ కాలిక ప్రణాళికలతో జట్టుకు విజయాలను అందించే ప్రయత్నం చేస్తాం. జట్టులోని యువ ప్రతిభావంతులకు సాయం చేయడమే మా ప్రధాన లక్ష్యం.'అని ఫ్లెమింగ్ చెప్పుకొచ్చాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ అయిన స్టీఫెన్ ఫ్లెమింగ్.. చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్‌గా 18 ఏళ్ల సేవలందించాడు. ఈ 18 సంవత్సరాల్లో 10 సార్లు జట్టును ఫైనల్‌కు చేర్చడంతో పాటు ఐదు టైటిళు అందించాడు. సీఎస్‌కేకు చెందిన ఇతర గ్లోబల్ ఫ్రాంచైజీలకు కూడా కోచ్‌గా సేవలందించాడు. న్యూజిలాండ్ కెప్టెన్‌గా 80 మ్యాచ్‌ల్లో 28 విజయాలు అందించాడు. కౌంటీ క్రికెట్‌లో నాటింగమ్‌షైర్ జట్టుకు సారథిగా వ్యవహరించి 2005 కౌంటీ ఛాంపియన్‌షిప్ టైటిల్ అందించాడు. 2017 నుంచి 2022 వరకు కెప్టెన్‌గా కొనసాగిన జోరూట్ తిరిగి సారథ్య బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యాడు. గతంలో 64 టెస్ట్‌ల్లో జోరూట్ 27 విజయాలు అందించాడు. ఇంగ్లండ్ సారథ్య బాధ్యతలను తిరిగి చేపట్టడం గర్వంగా ఉందని జోరూట్ తెలిపాడు. ఈ బాధ్యతల్లో కొనసాగడం ఎంతో కష్టమైనప్పటికీ.. సంతృప్తినిస్తోందని చెప్పాడు. స్టీఫెన్‌తో కలిసి పనిచేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానని వెల్లడించాడు.




# అంతర్జాతీయ క్రికెట్‌కు అజింక్య రహానే గుడ్‌బై..

భారత స్టార్ బ్యాటర్, మాజీ వైస్ కెప్టెన్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. సుమారు 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలుకుతూ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నాడు. టీమిండియా మాజీ వైస్ కెప్టెన్, క్లాసిక్ బ్యాటర్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు అధికారికంగా వీడ్కోలు పలికాడు. తన 17 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ ప్రయాణానికి ముగింపు పలుకుతూ గురువారం సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ వీడియో ద్వారా రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించాడు. జీవితంలో సరైన సమయం వచ్చినప్పుడు దాన్ని గౌరవించి ముందుకు సాగక తప్పదని ఈ సందర్భంగా అతడు ఉద్వేగభరితంగా పేర్కొన్నాడు. తనకు అండగా నిలిచిన బీసీసీఐకి, తన తోటి ఆటగాళ్లకు, కోచ్‌లకు, కోట్లాది మంది అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. 2011లో ఇంగ్లండ్‌పై టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన రహానే, ఆ తర్వాత కొన్ని రోజులకే రాహుల్ ద్రావిడ్ ఫేర్‌వెల్ సిరీస్‌లో వన్డేల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇక 2013లో ఢిల్లీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌తో టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. విరాట్ కోహ్లీ, పుజారాలతో కలిసి మిడిలార్డర్‌లో భారత జట్టుకు బలమైన వెన్నెముకగా నిలిచాడు. కఠినమైన విదేశీ పిచ్‌లపై అతడు ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆస్ట్రేలియా గడ్డపై 2020-21 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టును ముందుండి నడిపించిన తీరు అతడి కెరీర్‌లోనే ఒక సువర్ణాధ్యాయం. కోహ్లీ గైర్హాజరీలో జట్టు బాధ్యతలు చేపట్టి, యువ ఆటగాళ్లతో అద్భుతాలు సృష్టించాడు. మెల్‌బోర్న్‌లో అద్భుతమైన సెంచరీ సాధించి జట్టుకు చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని అందించాడు. ఆ సిరీస్ అతడి నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి చాటిచెప్పింది. భారత్ తరఫున 85 టెస్టులు ఆడిన రహానే 5077 పరుగులు సాధించాడు. అలాగే 90 వన్డేల్లో 2962 పరుగులు, 20 టీ20 మ్యాచుల్లో 375 పరుగులు తన ఖాతాలో వేసుకున్నాడు. జులై 2023లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచే అతడి కెరీర్‌లో ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, ఐపీఎల్ లాంటి ఫ్రాంచైజీ లీగ్స్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో తాను కొనసాగుతానని రహానే స్పష్టం చేశాడు. ఈ ఏడాది ఐపీఎల్ 2026లో కూడా అతడు ఆడాడు. పదేళ్లకు పైగా తన అద్భుత ఆటతో కోట్లాది మంది మనసులు గెలుచుకున్న ఈ సైలెంట్ వారియర్ రిటైర్మెంట్ వార్త అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది.

# భారత హాకీ కిట్ కలర్ మార్పుపై రచ్చ!

భారత హాకీ జట్ల జెర్సీ రంగును బ్లూ నుంచి కాషాయ రంగుకు (ఆరెంజ్) మార్చడంపై మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హాకీ ఇండియా స్పష్టం చేసింది. వచ్చే నెలలో బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరగనున్న ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ 2026 కోసం భారత పురుషుల, మహిళల జట్లు సిద్ధమవుతున్నాయి. ఈ మెగా టోర్నీ కోసం హాకీ ఇండియా (హెచ్ఐ) జాతీయ జట్ల జెర్సీ రంగును అనూహ్యంగా మార్చేసింది. దశాబ్దాలుగా భారత జట్టుకు ఐడెంటిటీగా ఉన్న సంప్రదాయ బ్లూ జెర్సీ స్థానంలో కొత్తగా కాషాయం (ఆరెంజ్) రంగు కిట్‌ను పరిచయం చేసింది. ఈ నిర్ణయంపై భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జెర్సీ రంగు మార్చడం వెనుక ఉన్న లాజిక్ ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ రంగు మార్పుపై సోషల్ మీడియాలో సైతం పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ వివాదంపై స్పందించిన హాకీ ఇండియా సీనియర్ అధికారి ఒకరు.. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని కొట్టిపారేశారు. జాతీయ జెండాలో కాషాయం ఒక భాగమని, మార్పును ఎప్పుడూ స్వాగతించాలని ఆయన సూచించారు. సంప్రదాయ బ్లూ జెర్సీని మార్చడానికి




ప్రధాన కారణం ఆటగాళ్ల విజిబిలిటీ అని ఆ అధికారి వివరించినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లు ఎక్కువగా బ్లూ టర్ఫ్ (మైదానం) పైనే జరుగుతున్నాయి. మైదానం రంగు, జెర్సీ రంగు ఒకేలా ఉండటం వల్ల ఆటగాళ్లను గుర్తించడం వీక్షకులకు కష్టంగా మారుతోంది. ఆరెంజ్ రంగు వల్ల కాంట్రాస్ట్ పెరిగి, టర్ఫ్‌పై ఆటగాళ్లు స్పష్టంగా కనిపిస్తారని ఆయన పేర్కొన్నారు. కొత్త కిట్‌ను ఆవిష్కరిస్తూ హాకీ ఇండియా ట్విట్టర్ (ఎక్స్) వేదికగా ఆసక్తికరమైన పోస్ట్ చేసింది. జెర్సీలోని ప్రతి కుట్టు ఒక కథను చెబుతుందని, ప్రతి రంగు దేశ గర్వాన్ని చాటుతుందని పేర్కొంది. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, విజయాలకు ప్రతీక అని వెల్లడించింది. ఉదయిస్తున్న సూర్యుడి స్ఫూర్తితో రూపొందించిన ఈ డిజైన్ సరికొత్త ఆరంభానికి సంకేతమని వివరించింది. ఇందులో తెలుపు రంగు ప్రత్యామ్నాయ జెర్సీలు కూడా ఉంటాయి. జెర్సీ మార్పు నిర్ణయం తనకు ఎంతో ఇబ్బందికరంగా అనిపించిందని వీరేన్ రస్కిన్హా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారత జట్టు వారసత్వం, గుర్తింపు ఎప్పుడూ 'బ్లూ' రంగుతోనే ముడిపడి ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. ఎన్నో ఏళ్ల పాటు గర్వంగా బ్లూ జెర్సీ ధరించానని, అభిమానులు కూడా మన జట్టును ఆ రంగులోనే చూడాలని కోరుకుంటారని అభిప్రాయపడ్డారు. తన వాదన కేవలం జాతీయ జట్టు గుర్తింపు, వారసత్వం గురించేనని రస్కిన్హా స్పష్టం చేశారు.


# లాంగ్ జంప్‌లో శ్రీశంకర్‌కు సిల్వర్




- పారా అథ్లెటిక్స్‌లో డబుల్ డిలైట్
- 2026 గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడలు

**గ్లాస్గో (స్కాట్లాండ్):** 2026 గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్‌కు మరో పతకం లభించింది. కేరళ అథ్లెట్ మురళీ శ్రీశంకర్ లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్‌తో మెరిశాడు. బుధవారం అర్ధరాత్రి అనంతరం జరిగిన పురుషుల లాంగ్ జంప్ ఫైనల్లో శ్రీశంకర్ 8.09 మీటర్ల జంప్‌తో ద్వితీయ స్థానంలో నిలిచాడు. భారత్‌కు చెందిన మరో అథ్లెట్ లోకేశ్ సత్యనాథన్ 7.97 మీటర్ల జంప్‌తో ఐదో స్థానంలో నిలిచి పతకానికి దూరమయ్యాడు. 2022 బర్మింగ్‌హామ్‌లో తొలిసారి బరిలోకి దిగి పతకం సాధించిన మురళీ శ్రీశంకర్.. కామన్‌వెల్త్ క్రీడల్లో వరుసగా రెండో మెడల్ సాధించాడు. జమైకా అథ్లెట్, మాజీ ప్రపంచ చాంపియన్ తజల్ గేల్ 8.15 మీటర్లలో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకం సొంతం చేసుకున్నాడు. 8.08 మీటర్ల జంప్‌తో స్కాట్లాండ్‌కు చెందిన స్టిఫెన్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. ఫైనల్లో తొలి ప్రయత్నంలో 8.03 మీటర్ల జంప్ చేసిన మురళీ శ్రీశంకర్.. రెండో ప్రయత్నంలోనే 8.09 మీటర్ల పతక జంప్ చేశాడు. ఆ తర్వాత వరుసగా రెండు ప్రయత్నాలు ఫౌల్ కాగా.. చివరి రెండు ప్రయత్నాల్లో 7.94మీటర్లు, 7.97 మీటర్ల జంప్‌తో సరిపెట్టాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించినా గాయంతో దూరమైన మురళీ శ్రీశంకర్ తాజాగా గ్లాస్గోలో కామన్‌వెల్త్ క్రీడల సిల్వర్ మెడల్‌తో తనేంటో నిరూపించుకున్నాడు. ఇదిలా ఉండగా, భారత పారా అథ్లెట్లు ఒకే ఈవెంట్లో రెండు పతకాలు సాధించారు. పురుషుల 100 మీటర్ల టీ47 ఫైనల్లో దిలీప్ గవిట్, మహ్మద్ బసిల్‌లు సత్తా చాటారు. 10.71 సెకండ్లలో రేసును ముగించిన దిలీప్ బంగారు పతకం సాధించగా, 10.83 సెకండ్లతో మహ్మద్ బసిల్ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఇక మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో జాతీయ రికార్డు బద్దలుకొట్టిన పారుల్ చౌదరి 9.26.75 టైమింగ్‌తో ఐదో స్థానానికి పరిమితమై పతకం చేజార్చుకుంది.

# ఫైనల్‌లోకి దూసుకెళ్లిన నీరజ్ చోప్రా



స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించాడు. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్ ఎనిమిదో రోజు పోటీలు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. భారత అథ్లెటిక్స్ జట్టుకు శుభవార్తగా, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించాడు. అతనితో పాటు భారత అథ్లెట్లు యశ్‌వీర్ సింగ్, రోహిత్ యాదవ్ కూడా ఫైనల్‌లోకి ప్రవేశించారు. దీంతో జావెలిన్ త్రో విభాగంలో భారత్‌కు పతక అవకాశాలు మరింత బలపడ్డాయి. ఈ విభాగానికి సంబంధించిన పతకాల పోటీలు జూలై 31న జరగనున్నాయి. ప్రస్తుతం కామన్వెల్త్ గేమ్స్‌లో అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, బాల్స్ పోటీలు కొనసాగుతుండగా, ట్రాక్ సైక్లింగ్‌లో కూడా భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించనుంది. భారత క్రీడాభిమానుల దృష్టి ఇప్పుడు జావెలిన్ త్రో ఫైనల్‌పై కేంద్రీకృతమైంది. స్వర్ణ పతకానికి ప్రధాన పోటీదారుడిగా భావిస్తున్న నీరజ్ చోప్రా క్వాలిఫికేషన్ రౌండ్‌లో అంచనాలకు తగ్గ ప్రదర్శన చేయకపోయినా, ఫైనల్‌లోకి సులభంగా అర్హత సాధించాడు. జావెలిన్ త్రోలో నేరుగా ఫైనల్‌కు చేరాలంటే 85 మీటర్ల క్వాలిఫికేషన్ మార్క్‌ను అధిగమించాల్సి ఉంటుంది. అయితే తొలి ప్రయత్నంలో నీరజ్ 76.28 మీటర్లు మాత్రమే విసరగలిగాడు. దీంతో నేరుగా అర్హత సాధించే మార్క్‌ను అందుకోలేకపోయాడు. అయితే రెండో ప్రయత్నంలో తన ప్రదర్శనను మెరుగుపరుచుకున్న నీరజ్ 79.61 మీటర్లు జావెలిన్ విసిరి మొత్తం ఫలితాల్లో ఐదో స్థానంలో నిలిచాడు. దీంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. భారత జట్టుకు చెందిన మరో ఇద్దరు జావెలిన్ త్రోయర్లు కూడా మంచి ప్రదర్శన కనబరిచారు. రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు, యశ్‌వీర్ సింగ్ 74.45 మీటర్లు నమోదు చేసి ఇద్దరూ ఫైనల్‌లో చోటు దక్కించుకున్నారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో పాకిస్థాన్ ఒలింపిక్ ఛాంపియన్ అర్షద్ నదీమ్ తొలి ప్రయత్నంలోనే విఫలమవడం ఆసక్తికరంగా మారింది. అనంతరం మూడు ప్రయత్నాలు పూర్తి చేసిన అతను గరిష్టంగా 78.63 మీటర్లు మాత్రమే నమోదు చేశాడు. ఫైనల్‌లో నీరజ్ చోప్రాకు అర్షద్ నదీమ్‌తో పాటు శ్రీలంకకు చెందిన యువ ప్రపంచ ఛాంపియన్ రుమేష్ పతిరాగేల నుంచి గట్టి సవాల్ ఎదురుకానుంది. ఈ ముగ్గురు మధ్య స్వర్ణ పతక పోరు ఉత్కంఠభరితంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు మహిళల 4000 మీటర్ల క్వాలిఫికేషన్ రేసులో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత అథ్లెట్ లీషా దాస్ 6:58.000 నిమిషాల్లో రేసును పూర్తి చేసినప్పటికీ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. ఇంగ్లాండ్‌కు చెందిన మోర్గాన్ న్యూబెర్రీ కంటే ఆమె 1 నిమిషం 51 సెకన్లు వెనుకబడటంతో ఐదో స్థానానికి పరిమితమైంది. ఆస్ట్రేలియాకు చెందిన ఎరిన్ నార్మోయిల్ (5:24.264), ఇంగ్లాండ్‌కు చెందిన కదీనా కాక్స్ (6:37.119) ప్రదర్శనల నేపథ్యంలో లీషా ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. ఇదిలా ఉండగా, కామన్వెల్త్ గేమ్స్‌లో భారత క్రీడాకారులకు బుధవారం చారిత్రాత్మక రోజుగా నిలిచింది. భారత బాక్సర్లు ఏకంగా 10 పతకాలను ఖాయం చేయగా, లాంగ్ జంప్ స్టార్ మురళీ శ్రీశంకర్ కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో వరుసగా రెండు పతకాలు గెలిచిన తొలి భారత లాంగ్ జంపర్‌గా రికార్డు సృష్టించాడు.

## మరో లవ్ గ్రాక్ మూవీ శ్రీనివాస మంగాపురం

**- ఆకట్టుకున్న జయకృష్ణ, రాషా తండానీ నటన**




ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్థం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్థంలో వచ్చే ఫ్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్సెస్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు.

# రామాయణ ట్రైలర్ విడుదల




**- అద్భుత దృశ్య కావ్యంగా మలచిన నితీశ్ తివారి**

ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్యనూతనం. ఇప్పటికే ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. యశ్ స్క్రీన్‌పై కనిపించిన ప్రతిసారీ తన గాంభీర్యం ప్రేక్షకులను మైమరిపించింది. 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ ఆ శ్రీమహావిష్ణువు అవతారమెత్తుతాడు' అంటూ రాముడి పాత్రను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ కపూర్ ఆకట్టుకున్నారు. మొత్తం నాలుగు నిమిషాల ఈ ట్రైలర్ సినీ ప్రేక్షకులను త్రేతాయుగానికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్ష్మణ రేఖ సందర్భంలో కూడా ఆమె చేతిలో ఖడ్గం కనిపించడంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపించనున్నట్లు అర్థమవుతోంది. పుష్పక విమానం రామాయణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రుడితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావతాన్ని అద్భుతమైన విజువల్‌తో ఆవిష్కరించారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడ్డుకునే జటాయువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధాన్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయువును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వ పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకూ రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు కూడా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైకేయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశురాముడు రాముడిని కలిసే ఘట్టం కూడా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రకూటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవీ దూబే కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్ష్మణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుంటాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘోరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ-రావణ యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది.

# నవ్వుతో కట్టిపడేస్తున్న ప్రగ్యా జైశ్వాల్..

**కంచె, అఖండ, అఖండ 2, డాకు మహారాజ్ సినిమాలతో తెలుగులోమంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది ప్రగ్యా జైశ్వాల్. ఈ జబల్ పూర్ బ్యూటీ నెట్టింట యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్లలో జోష్ నింపుతుంటుంది. సోషల్ మీడియాలో తనకు సంబంధించిన అప్‌డేట్స్‌ను షేర్ చేసుకునే ప్రగ్యాజైశ్వాల్ తాజాగా పోస్ట్ చేసిన ఫొటోలు కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.ప్రగ్యాజైశ్వాల్ సెలబ్రిటీ, ఫ్యాషన్ స్టైలిస్ట్ నటాషా బోత్రా అండ్ టీం డిజైన్ చేసిన ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో హొయలు పోయింది. బ్లూ అండ్ వైట్ చారలతో డిజైన్ చేసిన డ్రెస్‌లో చిరునవ్వులు చిందిస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'చారలు తిరిగి వచ్చాయని విన్నా..' అంటూ ఈ స్టిల్స్‌కు క్యాప్షన్ ఇచ్చింది.చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్టుగా ఉన్న ప్రగ్యాజైశ్వాల్ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న టైసన్ నాయుడులో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది ప్రగ్యాజైశ్వాల్.**



## విశ్వంభరతో పోటీ పడనున్న జైలర్-2



అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆగస్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్‌డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్‌ను దసరా పండుగకు టా÷-గ్గ÷ట్ చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు సమాచారం. అయితే చిరంజీవి దసరా పండుగకు రాబోతుండటం అంతకంటే ఒక్కరోజు ముందుగానే రజనీకాంత్ జైలర్ 2 ప్రేక్షకులు రాబోతుండడంతో ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది

## సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం




తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

# లెనిన్ సరికొత్త రికార్డులు

**- వందకోట్ల క్లబ్బులో అఖిల్ లెనిన్ చేరిక**

టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

